ఆక్రమణ

ప్రజాశక్తి-గంగవరం: కబ్జాకు కాదేదీ అనర్హం అన్న చందంగా ఆక్రమణదారులు పేట్రేగిపోతున్నారు. గుట్టలు, చెరువులు, ప్రభుత్వ స్థలాలే కాదు.. రస్తా పొరంబోకు స్థలాన్ని మింగేశారు. వివరాల్లోకెళితే.. గంగవరం మండలం కలగటూరు పంచాయతీ క్రాస్‌కు అతి సమీపంలో జగనన్న కాలనీకి దాదాపు ప్రభుత్వం 20ఇండ్లు మంజూరు చేసింది. అక్కడి స్థానికులకు పట్టాలిచ్చారు కూడా. ఆ స్థలానికి పక్కనే ఉన్న 136సర్వే నెంబర్‌లో 1.46ఎకరాల రస్తా పొరంబోకు స్థలంలో ఓ ఆసామి కన్నుపడింది. అంతే ఇట్టే ఆక్రమించి షెడ్లు నిర్మాణం చేపట్టేశారు. ఆక్రమణ చెర నుంచి ఆ స్థలాన్ని కాపాడాలని ఎదురించే ధైర్యం లేక, పట్టించుకొనే వారు లేక మండల స్థాయి అధికారుల వద్ద ఆ గ్రామస్తులు అనేక సార్లు మొరపెట్టుకున్నారు. అన్యాక్రాంతమవుతున్న స్థలాన్ని తిరగి స్వాధీనం చేసుకోవాలని కోరారు. అయినా పరిష్కారం కావడం లేదని ఆ గ్రామస్తులు మండిపడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులైనా స్పందించి ఆక్రమిత రస్తా పొరంబోకు స్థలాన్ని తిరిగి ప్రజా అవసరాలకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వినమ్రంగా..

ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

- జిల్లా కేంద్రానికి పోటెత్తిన అర్జీ దారులు
- కలెక్టరేట్‌కు 194 అర్జీలు
- ఎస్పీ కార్యాలయానికి 39ఫిర్యాదులు
- నగరపాలకకు 8వినతులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: వివిధ సమస్యలతో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు అర్జీలు చేతపట్టుకొని జిల్లా కేంద్రానికి పోటెత్తారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులకు వివరించారు. వాటిని పరిష్కరించాలని కోరారు.

కలెక్టరేట్‌కు..

కలెక్టరేట్ కార్యాలయానికి అత్యధికంగా 194అర్జీలు అందగా వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 171, డీఆర్‌వో 5, నేషనల్ హైవే 5, పోలీస్‌శాఖ 3, డీఆర్‌డీఏ 4, నగర మున్సిపాలిటీ 1, ఏపీఎస్ ఆర్‌టీసీ 2, డ్వామా 1, డీసీవో-ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ 1, సమగ్రశిక్ష 1 చొప్పున అర్జీలు అందాయి. ప్రజల వద్ద నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్ నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి అక్కడికక్కడే సంబంధించిన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మరికొన్ని వినతులకు సంబంధించి ఆయా మండలాల తహశీల్దార్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తహశీల్దార్‌లకు దిశానిర్దేశం చేశారు. మరికొందరి అధికారులతో నేరుగా ఫోన్ ద్వారా మాట్లాడారు. కార్యక్రమంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్‌వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్‌లు ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు.

ఎస్పీ కార్యాలయానికి..

వివాదాలు, వేదింపులు వంటి, తగువులకు సంబంధించిన ఫిర్యాదులతో ప్రజలు సోమవారం ఎస్పీ కార్యాలయానికి విచ్చేశారు. ఎస్పీ మణికంఠ చందోలు ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు నేరుగా స్వీకరించారు. ఫిర్యాది నుంచి వివరాలను పూర్తిగా విన్న ఎస్పీ సంబంధిత అధికారులను అక్కడికక్కడే తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విచారణ జరిపి త్వరితగతిన బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ఎస్పీతో పాటు అడ్మిన్ ఏఎస్పీ ఆరిపుల్లా, దిశా డీఎస్పీ సుధాకర్‌రెడ్డిలు అర్జీలు స్వీకరించారు. ఎస్పీ కార్యాలయానికి మొత్తం 39ఫిర్యాదులు అందగా వాటిలో తగాదాలు 3, వేదింపులు 6, డబ్బు తగాదాలు 11, భూ తగాదాలు 14, ఆస్తి తగాదాలు 5 చొప్పున ఫిర్యాదులు అందాయి. కార్యక్రమం అనంతరం 2014వ ఏడాధిలో మైనర్ బాలికపై జరిగిన అత్యాచార సంఘటనలో ముద్దాయికి 24సం. జైలు శిక్ష పడుటకు కృషి చేసిన కోర్ట్ మానిటరింగ్ సెల్ ఏఎస్ఐ భక్తవత్సలం, కోర్ట్ కానిస్టేబుల్ రేణుక, గుడుపల్లె కానిస్టేబుల్ సోమశేఖర్‌కి ఎస్పీ సర్టిఫికెట్స్ ప్రదానం చేసి ప్రత్యేకంగా అభినందించారు.

నగరపాలకకు..

చిత్తూరు నగర పరిధిలో వివిధ సమస్యలతో ప్రజలు నగరపాలక కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమలో వినతులు అందించారు. వారి నుంచి నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ విన్నపాలను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులు అక్కడికక్కడే ఆదేశించారు. కాగా మెప్మా 5, పబ్లిక్ హెల్త్ 1, ఇంజనీరింగ్ 2 చొప్పున మొత్తం 8వినతులు అందినట్లు అక్కడి అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంఈ గోమతి, ఎంహెచ్వో డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

అపోలో కళాశాలలో వర్క్‌షాప్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: పాలివగల్ థెరపీ అండ్ ఇట్స్ క్లినికల్ ఇంప్లికేషన్ ఇన్ ఆటిజం విధానాలపై వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ఈ వర్క్‌షాప్‌ని రిసోర్స్ పర్సన్ డాక్టర్ లోకనాధం, గురుస్వామి నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యాఖ్యతలు మాట్లాడుతూ పాలివగల్ థెరపీ, వాటి అత్యున్నత విధానాలను ఉపయోగించడం ద్వారా చిన్నపిల్లల్లో వ్యాధులైన ఆటిజం, న్యూరోడెవలప్మెంటల్ వ్యాధులను నివారించగలం అని, వయస్సుకు తగ్గట్లు పిల్లల్లో రావాల్సిన మానసిక పరమైన ఎదుగుదల రాకుండా ఉండే పరిస్థితినే ఆటిజం అంటారన్నారు. ఈ సమస్య పిల్లల్లో బాల్యంలోనే ప్రారంభమయ్యే జీవితకాల నాడీ సంబంధిత రుగ్మతగా (న్యూరోలాజికల్ డిజార్డర్) కూడా చెప్పవచ్చునన్నారు. సమగ్ర, లోతైన ఇంటర్వ్యూలు, ప్రవర్తనా పరిశీలనల ద్వారా వైద్యులు ఆటిజం కోసం మూల్యాంకనం చేస్తారన్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు. అపోలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్ ఈ సమావేశంలో ప్రసంగిస్తూ, ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడానికి గర్వపడుతూ, కార్యక్రమానికి సహకరించిన అపోలో యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. చివరగా కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసినటువంటి వ్యాఖ్యాతలను ఘనంగా సత్కరించారు.

సీపీఎం నాయకులపై దాడి హేయం

- ఖండించిన జిల్లా సీపీఎం నేతలు

ప్రజాశక్తి-పలమనేరు: పల్నాడు జిల్లా రొంపిచర్ల మండల సిపియం నాయకులు కామినేని రామారావుపై టీడీపీ మూకలు దాడి చేయటం హేయం అని సీపీఎం జిల్లా నాయకులు ఓబులరాజు, గిరిధర్ గుప్తా, భువనేశ్వరి పేర్కొన్నారు. సోమవారం పలమనేరు సీపీఎం కార్యాలయంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్‌తో కలసి విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 1న గ్రామంలో పెన్షన్లు పంపిణీ సందర్భంగా పెన్షన్లు లబ్దిదారులకు వారి ఇంటి వద్దే ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయానికి భిన్నంగా టీడీపీ నాయకలు వ్యవహరించారన్నారు. ఆ పార్టీ నాయకుని ఇంటివద్దకి అందరూ లబ్దిదారులు రావాలని దండోరా వేయించడాన్ని వ్యతిరేకించి లబ్దిదారులతో సిపిఎం నాయకులు కలసి అధికారుల వద్దకు వెళ్లారు. తమ సమస్యను చెప్పుకోగా జిల్లా కలెక్టరు లబ్దిదారుల ఇండ్ల వద్దనే పెన్షన్ ఇప్పించారన్నారు. దీనికి ఆగ్రహించిన టీడీపీ మూకలు పథకం ప్రకారం రామారావు ఇంటిపై దాడిచేసి 90సంవత్సరాల వృద్ధురాలిని రామారావును తీవ్రంగా గాయపరిచారన్నారు. ఆయన గతంలో గ్రామ సర్పంచ్‌గా పని చేయడమే కాక, ప్రస్తుతం కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షునిగా పని చేస్తున్నారన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే వారిపై దాడి చేయడం సరికాదన్నారు. ఇలాంటి ఘటనల వల్లనే గత ప్రభుత్వం రాష్ట్రంలో నామరూపాలు లేకుండా పోయిందనే విషయాన్ని గుర్తించుకొని మసలు కోవాలని హితువు పలికారు. అధికారులు వెంటనే స్పందించి నిందితులపై హత్యా నేరం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఈశ్వర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

అడ్డంకులు తొలగించారు..

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరంలో నిత్యం వాహనాల రద్దీగా ఉండే మార్గాల్లో చర్చి వీధి ప్రధానమైనది. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వెళ్లే మార్గమూ ఇదే కావడంతో ట్రాఫిక్ రద్దీ కారణంగా రోగులు ఇబ్బంది పడేవారు. ఇదే సమయంలో దుకాణాదారులు ముందుకు రావడం, ఫుట్ పాత్‌పై అడ్డంకులు, ఆక్రమణల కారణంగా వాహనాల రాకపోకలు మరింత ఇబ్బందికరంగా తయారైంది. ఇటీవల చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్.. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వెళ్లే చర్చి వీధిలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్, ట్రాఫిక్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వారి సూచనలతో నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ, ట్రాఫిక్ సిఐ నిత్యబాబు పర్యవేక్షణలో చర్చి వీధి, బజారు వీధి, పండ్ల మార్కెట్ వీధుల్లో అడ్డంకులు, ఆక్రమణలు తొలగించారు. ఫుట్ పాత్‌లను క్లియర్ చేశారు. వాహనాల పార్కింగ్ ప్రక్రియను క్రమబద్ధీకరించారు. దీంతో ప్రస్తుతం చర్చి వీధి, పండ్ల మార్కెట్ లో వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు మార్గం సుగమం అయింది. చర్చి వీధిలో వాహనాలు, అంబులెన్సులు ఆసుపత్రికి వెళ్లడానికి అనువుగా మారింది. ట్రాఫిక్ ఇబ్బందులు తొలగడంతో ప్రజలు వర్షం వ్యక్తం చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ చిత్తూరు 8వ అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్ట్ తీర్పునిచ్చింది. 2017లో బైరెడ్డిపల్లి మండలంలో జరిగిన హత్య కేసులో ముద్దాయి ఎం.శ్రీనివాసులు, శీనప్పకు జీవిత ఖైదు విధిస్తూ 8వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ శ్రీదేవి సోమవారం తీర్పునిచ్చారు. కేసు వివరాల మేరకు.. బైరెడ్డిపల్లి మండలం కుప్పనపల్లి గ్రామంలో కాపురముంటున్న బి.సీనప్పకు ఇద్దరు భార్యలు, అందులో తన రెండవ భార్య సుజాతమ్మతో ముద్దాయి ఎం.శ్రీనివాసులు, ఏ.శీనప్పకు అక్రమ సంబంధం ఏర్పడింది. ఇది తెలిసిన బి.సీనప్ప భార్య సుజాతమ్మను మందలించే వాడు. ఇది తెలుసుకున్న ముద్దాయి ఎలాగైనా బి.సీనప్పను చంపాలని అదనుకోసం ఎదురుచుసాడు. మే 16 2017వ తేదీన బి.సీనప్ప ఒంటరిగా పంట పొలాల పనికి వెళ్ళాడని తెలుసుకున్న ముద్దాయి అక్కడకు వెళ్లి అతనితో గొడవపెట్టుకొని పక్కనే ఉన్న భైరవస్వామి గుడి వద్దకు తీసుకెళ్ళి అతని గొంతుకు దారం బిగించి ఊపిరి ఆడనివ్వకుండా చంపేసి అక్కడి నుండి వెళ్ళిపోయాడు. దీనిపై మరణించిన బి.సీనప్ప తమ్ముడు వెంకటేసప్ప మే 17 2017వ తేదీన బైరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైం నెంబరు 16/2017 బ/o 302, 201 సెక్షన్‌ల కింద అప్పటి బైరెడ్డిపల్లి ఎస్ఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంబించారు. అప్పటి పలమనేరు రూరల్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ రావు విచారణ అధికారిగా నియమించగా అనుమానితులను విచారిస్తున్న సమయంలో 02-03-2018వ తేదీన ముద్దాయి శ్రీనివాసులు, శీనప్ప విచారించగా తానే హత్య చేశానని ఒప్పుకోవడంతో అతనిని అరెస్ట్ చేసి దర్యాప్తు నిమిత్తం రిమాండ్‌కు పంపించారు. సదరు కేసు విచారణ పూర్తి అయి సోమవారం తీర్పు ఇవ్వడం జరిగింది. తీర్పులో బాగంగా ముద్దాయి ఎం.శ్రీనివాసులు, ఏ.శీనప్పకు 8వ అడిషనల్ డిస్ట్రిక్ట్ కోర్ట్ జడ్జ్ శ్రీదేవి ముద్దాయికి జీవిత ఖైదు, రూ.1,000 జరిమానా విధిస్తు తీర్పును ఇచ్చారు. ఈ కేసులో ముద్దాయికి శిక్ష పడుటకు కృషి చేసిన అప్పటి పలమనేరు రూరల్ ఇన్స్పెక్టర్ మధుసూధన్, కోర్ట్ మానిటరింగ్ సెల్ ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ కె.బాలయ్య, కోర్టుకు సాక్షాలను సకాలంలో హాజరు పరచిన కోర్ట్ కానిస్టేబుల్లు చలపతి, శేఖర్ బాబు, హరి, కోర్ట్ మానిటరింగ్ సెల్ సిబ్బందిని చిత్తూరు జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

మామిడి చెట్లను నరికేయడం దారుణం

- బాధితునికి న్యాయం చేస్తాం..
- తహశీల్దార్ స్వర్ణలత

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని టి.గడ్డురుకు చెందిన నారాయణప్ప మామిడి చెట్లు నిరికేయడం దారుణమని తహశీల్దార్ స్వర్ణలత అన్నారు. బాధితునికి న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. వివరాల్లోకెళితే.. మండలంలోని టి.గడ్డురుకి చెందిన నారాయణప్పకు అదే గ్రామంలోని సర్వే నెంబర్ 199/3ఏలో రెండు ఎకరాల 24సెంట్ల స్థలం ఉంది. మూడేళ్ల కిందట ఆ భూమిలో ఉపాధి హామీ పథకం ద్వారా మామిడి చెట్లు నాటాడు. ఓర్వలేక పోయిన అదే గ్రామంలో ఉంటున్న శ్రీనివాసులు, సత్యనారాయణ, మంజుల, తిప్పన్న, రాజేంద్రలు ఈ నెల 5న రాత్రి ఆ మామిడి చెట్లను నేలమట్టం చేశారు. కాగా బాధితులు నారాయణప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంగా ఎస్ఐ కృష్ణయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా యథావిధిగా నారాయణప్ప సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. అక్కడే ఉన్న ప్రత్యర్థులు మామిడి చెట్లు పొలంలో అడుగుపెడితే అంతమొందిస్తామని బెదింపులకు పాల్పడడంతో, అక్కడి నుంచి నారాయణప్ప ఆందోళనతో మండల తహశీల్దార్ స్వర్ణలతను ఆశ్రయించి జరిగిన విషయాన్ని చెప్పారు. స్పందించిన తహశీల్దార్ గ్రామ వీఆర్‌వో, సర్వేయర్‌లను వెంట తీసుకొని ఆ భూమిని పరిశీలించారు. నారాయణప్పకు సంబంధించి రికార్డులు ఉన్నట్లు గుర్తించారు. మామిడి చెట్లను నరకడం దారుణమని తహశీల్దార్ ఆగ్రహించారు. బాధితుడు నారాయణప్పకు న్యాయం చేస్తామని ఆమె తెలిపారు.

వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న తహశీల్దార్

అనధికార వాటర్ ప్లాంట్లకు నోటీసులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరంలో అనధికారికంగా ఉన్న వాటర్ ప్లాంట్ (నీటి శుద్ధి కేంద్రాలు)కు నగరపాలక సంస్థ అధికారులు నోటీసులు జారీ చేశారు. నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశాలతో నగరపాలక పరిధిలో అన్ని వార్డుల్లోని నీటి శుద్ధి కేంద్రాలను నగరపాలక అధికారులు తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా ఫుడ్ సేఫ్టీ డిపార్ట్మెంట్ నుంచి ఐఎస్ఐ వాటర్ టెస్టింగ్ సర్టిఫికేట్, ట్రేడ్ లైసెన్స్, వాటర్ ప్లాంట్ బిల్డింగ్ అప్రూవల్ లేని వాటర్ ప్లాంట్లను గుర్తించి నోటీసులను జారీ చేశారు. అనధికార వాటర్ ప్లాంట్లన్నీ నోటీసులు అందిన సత్వరం మూసివేయాలని కమిషనర్ ఆదేశించారు. లేనిపక్షంలో కార్పొరేషన్ యాక్ట్ 1955 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ నోటీసులో హెచ్చరించారు.

మూఢనమ్మకాలపై...

ప్రచారమేది..?

వేపచెట్టు ఎండిందని ఊరంతా వలస

అల్లూరి సీతారామరాజు గిరిజన కాలనీలో ఘటన

వేరుకు వైరస్ సోకడంవల్లే: జనవిజ్ఞాన వేదిక

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి

మనిషి ఆదిమ సమాజాన్ని దాటి ఆధునిక సమాజంలో కాలుపెట్టాడు.. 'మంత్రాలకు చింతకాయలు రాలవని' శాస్త్రీయంగా నిరూపణ చేశాడు.. ఊహకందని ప్రయోగాలతో మానవాళికి ఉపయోగపడే ఎన్నో అత్యాధునిక యంత్రాలను కనుగొన్నాడు..భూత వైద్యానికి అందని మహమ్మారిని సైతం సైన్స్ అనే చికిత్స ద్వారా నిలువరించగలిగాడు.. ఒక్క మాటలో చెప్పాలంటే అవయవమార్పిడితో సృష్టికి ప్రతిసృష్టి చేశాడు. అయినా నేటికీ సమాజంలో మూఢ నమ్మకాలకు జీవితాలు బలవుతూనే ఉన్నాయి. అమాయక ప్రజల అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుంటున్న తాంత్రికులు అందినకాడికి దోచుకుంటున్నారు. భయాన్ని ఎరగా వేసి ప్రజల కష్టాన్ని పిండుకుంటున్నారు. అయితే అధికార యంత్రాంగంలో ఏమాత్రం చలనం లేదు. గతంలో ఇలాంటి సంఘటన ఇటీవల తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం పరమాలపల్లిలో వెలుగు చూసింది. తాజాగా తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం గుండేలిగుంట పంచాయతీ అల్లూరి సీతారామరాజు గిరిజన కాలనీలో మరో ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి పోతే..

అల్లూరి సీతారామరాజు కాలనీలో సుమారు 40 గిరిజన కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. ఆ గ్రామం నడిబొడ్డున ఉన్న వేప చెట్టే వారి గ్రామ దేవత. కష్టమొచ్చినా..నష్టమొచ్చినా, బాధ కలిగినా.. ఆనందం వచ్చిన ఆ వేప చెట్టుకే మొరపెట్టుకునేవారు. వేప చెట్టు పచ్చంగా ఉంటే గ్రామంలో శాంతి, లేకుంటే అశాంతి అని భావించేవారు. ఈ క్రమంలో గత కొన్ని నెలలుగా వేప చెట్టు ఎండిపోతూ వస్తోంది. ఇదే సమయంలో కాలనీలో కొంతమంది రోగాల బారిన పడి మతి చెందారు. ఇటీవల పలువురికి డయేరియా సోకడంతో వాంతులు విరోచనాల బారిన పడి ఆస్పత్రుల పాలయ్యారు. ఓవైపు వేపచెట్టు ఎండిపోవడం.. ఇంకోవైపు రోగాలు ప్రబలి మరణాలు సంభవించడం, అందరూ ఆసుపత్రుల ఫాలవ్వడం చూసి గిరిజనులు తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. గ్రామ దేవతగా కొలిచే వేపచెట్టు ఎండిపోవడంతో గ్రామానికి అరిష్టం పట్టుకుందనీ, అందుకే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని భావించి భూతవైద్యులను ఆశ్రయించారు. భూత వైద్యులు ఇదే అదునుగా మీ గ్రామానికి దెయ్యం పట్టుకుందనీ, వేప చెట్టుకు సరిగ్గా పూజలు చేయకపోవడంతో, గ్రామ దేవతే పిశాచిగా మారిందనీ, శాంతి పూజలు చేయకుంటే మరణాలు మరింత పెరుగుతాయంటూ బెదిరించారు. దీంతో గ్రామంలోని కొన్ని కుటుంబాలు వలస బాట పట్టాయి. ఇక్కడే ఉంటే ప్రాణాలు పోగొట్టుకుంటామనీ, పరిస్థితులు చక్కబడే వరకు బంధువుల ఊర్లలో తలదాచుకుందామంటూ కొన్ని కుటుంబాలు వెళ్లిపోవడం గమనార్హం. మిగిలి ఉన్న కుటుంబాలు భూత వైద్యుల చుట్టూ తిరుగుతూ చేతి చమురు వదిలించుకుంటున్న పరిస్థితి కనబడుతోంది. అల్లూరి సీతారామరాజు గిరిజన కాలనీలో మూఢనమ్మకాలు ప్రబలి ఊరంతా వలస పోతున్నా, గిరిజనులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వణికి పోతున్నా ప్రభుత్వ యంత్రాంగానికి ఏమాత్రం చీమకుట్టినట్లు లేకపోవడం గమనార్హం. ఈ విషయాన్ని గతంలోనే 'ప్రజాశక్తి' ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో గిరి పుత్రులకు ఈ దుస్థితి పట్టింది. ఇకనైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి అల్లూరి సీతారామరాజు గిరిజన కాలనీలో నెలకొన్న మూఢనమ్మకాలను పారదోలేందుకు తగు అవగాహనా కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వేరుకు వైరస్ సోకి ఎండిపోయిన వేప చెట్టు

భయం వద్దు: జేవీవీ

యానాదులు భయం వీడాలని జన విజ్ఞాన వేదిక నాయకులు సూచించారు. అల్లూరి సీతారామరాజు ఎస్టీ కాలనీ లో సోమవారం జనవిజ్ఞాన వేదిక నాయకులు పర్యటించారు. వేపచెట్టు ఎండిపోవడం సహజంగా జరిగేదేననీ, అదేదో అరిష్టంగా భావించి వలసలు పోవడం మానుకోవాలని సూచించారు. కురుస్తున్న వర్షాల కారణంగా కలుషిత నీటితో అతిసార ప్రబలి పలువురు ఆస్పత్రుల పాలయ్యారనీ, దీర్ఘ కాలిక రోగాలతో కొందరు మరణించారని గుర్తు చేశారు. ఇదేదో అరిష్టంగా భావించి భూత వైద్యులకు డబ్బులు దారబోయద్దని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులను బడులకు పంపకుండా ఉండొద్దని సూచించారు. మండల ఉపాధ్యాక్షులు మునీశ్వర రెడ్డి, కార్యదర్శి చెంచయ్య పాల్గొన్నారు. వేరుకు వైరస్ సోకడం వల్ల చెట్టు ఎండిపోయిందని తెలిపారు.

10న జరిగే కోర్కెల దినోత్సవాన్ని జయప్రదం చేయండి

- అంగన్వాడి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ పిలుపు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: దేశ వ్యాప్తంగా అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కోసం జూలై 10న కోర్కెల దినోత్సవం కార్యక్రమాన్ని చిత్తూరు జిల్లాలో జయప్రదం చేయాలని సోమవారం చిత్తూరులో జరిగిన ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా సమావేశం పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షురాలు లలిత అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సుబ్బరావమ్మ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేయడంతో దేశవ్యాప్తంగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున అంగన్వాడీలు ఉద్యమించారని తెలిపారు. ఐసిడిఎస్ ఏర్పాటు చేసిన తర్వాత శిశు మరణాలు రేటు బాగా తగ్గడంతో ఈ ప్రాజెక్టును బలోపేతం చేయాల్సింది పోయి మతోన్మాద బీజేపీ ప్రభుత్వం నీరుగార్చిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కేంద్ర ప్రభుత్వం అంగన్వాడీలకు గ్రాట్యూట్ అమలు చేయకుండా కనీస వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులు గురిచేస్తోందన్నారు. అలాగే గత రాష్ట్ర ప్రభుత్వం ఐదు సంవత్సరాలుగా అంగన్వాడీల సమస్యలను పరిష్కా రం చేయకపోవడంతో ఎన్నికలకు ముందు 42 రోజులు పాటు అంగన్వాడీలు సమ్మె చేశారని, ఈ సందర్భంగా గత రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలపై పలు రకాలుగా నిర్బంధకాండ ప్రయోగించిందన్నారు. ఎస్మాపెట్టి వేలాది మందిని తొలగించే ప్రయత్నం చేసిందన్నారు. అయినా అంగన్వాడీలు చలో విజయవాడకు పిలుపునిచ్చి బలమైన పోరాటం చేయడంతో ప్రభుత్వం దిగివచ్చి చర్చలకు పిలిచి జూలైలో అన్ని రకాల సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పి హామీ ఇచ్చిందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంగన్వాడీల సమస్య సందర్భంగా వారు శిబిరాల దగ్గరకు వచ్చి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంగన్వాడీల సమస్యను పరిష్కారం చేస్తామని గతంలో హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ ప్రకారం అంగన్వాడీలందరూ గత ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించి ప్రస్తుత ప్రభుత్వాన్ని అధికారంలోకి తెప్పించడంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ అభినందనలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రభుత్వమైనా అంగన్వాడీల సమస్యలను పరిష్కారం చేసే దిశగా చర్యలు చేపట్టి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అక్కడక్కడ రాజకీయ వేదింపులు పాల్పడుతున్నారని వాటిని మానుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పుదాలే చేయవద్దని హితవు పలికారు. యూనియన్ జిల్లా కార్యదర్శి షకీలా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజులు మాట్లాడుతూ సమ్మె అనంతరం జిల్లాలో అక్కడక్కడ కొంతమంది అధికారులు అంగన్వాడీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని వాటిని మానుకోవాలని డిమాండ్ చేశారు. వర్కర్ల మధ్య చీలిక తీసుకొస్తూ అధికారులు పబ్బం గడుపుకుంటున్నారని వాటిని మానుకోవాల న్నారు. ఈ సమస్యలు పరిష్కారంపై సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని తెలిపారు. అంగన్వాడీలందరూ ఐక్యంగా సమ స్యలు పరిష్కారం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అంగన్వాడీన జిల్లా నాయకులు మమత, ధనకోటి ఎర్రమ్మ, మమతలతోపాటు అంగన్వాడీలు పాల్గొన్నారు.



సమస్యల సంత పట్టించుకోండి కొంత

- రోడ్డుపై వారపు సంత నిర్వహణ
- అడుగడుగునా ట్రాఫిక్‌కి అంతరాయం
- వాహనదారులకు తప్పని తిప్పలు
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని స్థానికుల డిమాండ్

ఆ ఊరు నాలుగు ప్రధాన పట్టణాలకు వెళ్లే మార్గంలో కేంద్రంగా ఉంది. పుత్తూరు - చిత్తూరు, చిత్తూరు - తిరుపతి, తిరుపతి - పల్లిపట్టుకు వెళ్లాలంటే అదే దారిలో వెళ్లాలి. నిత్యం ఆ రహదారులన్నీ రద్దీగా ఉంటాయి. వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం కేంద్రంలో మూడు రోడ్ల కూడలిలో నిత్యం ట్రాఫిక్ సమస్యే. దీనికి తోడు ఆదివారం అయితే రైతులు, వ్యాపారస్తులు రోడ్డుపైనే సంత నిర్వహి స్తుండడంతో మరింత ఇబ్బంది నెలకొంది.
- ప్రజాశక్తి-వెదురుకుప్పం

పచ్చికాపల్లం చిన్న పాటి పట్టణం తలపిస్తుంది. తిరుపతి, పుత్తూరు, చిత్తూరు, పల్లిపట్టు నగరాలకు ఈ ఊరి మీదుగా వెళ తుంటారు. అధిక సంఖ్యలో గ్రామాలు ఈ రహదారి గుండానే ఉన్నాయి. పచ్చికాపల్లంకి సమీపంలోనే దాదాపుగా 200గ్రామాలు ఉన్నాయి. అయితే అక్కడ ఆదివారం వారపు సంత జరుగుతుంది. పంటలు పండించిన రైతులు, వ్యాపారస్తులు వస్తుంటారు. ఆదివారం జరిగే వారపు సంతకు ఇరుగుపొరుగు గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో వస్తారు. పచ్చికాపల్లంలో వారపు సంత స్థలం ఉన్నా.. అక్కడ నిర్వహణ లేక వ్యాపారస్తులు, రైతులు రోడ్డుపైకి వచ్చి కూరగాయాలు విక్రయిస్తుంటారు. ఆదివారం సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 9గంటల వరకూ రద్దీగానే ఉంటుంది. రోడ్డుపై కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అంతే కాకుండా అటుగా వెళ్లే భారీ వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. ఇక కార్లు, బైక్‌ల పరిస్థితి అయితే ఇక చెప్పనక్కర్లేదు. ఆదివారం సాయంత్రమైతే పచ్చికాపల్లంలో హారన్ మోత మోగిపోతుందంతే.

కుప్పలు తెప్పలుగా చెత్త..

పచ్చికాపల్లంలో ఆదివారం నిర్వహించే వారపు సంతతో చెత్తా చెదారం ఎక్కడికక్కడ పేరుకుపోతుంది. రోడ్డుపైనే చెత్త ఉండడంతో సంతకు వచ్చిన వారు రోడ్డుపై జారిపడిపోతుండటం వంటివి నిత్యం జరుగుతుంటాయి. ఇప్పటికే ఉన్న వారపు సంత స్థలంలో ఎలాంటి నిర్వహణ లేకపోయింది. కొనుగోలుదారులను ఆకర్షించుకు వ్యాపారస్తులు, రైతులు రోడ్డుపై తట్టల్లో కూరగాయలు విక్రయించేందుకు మక్కువచూపుతున్నారు. సంత స్థలంలో సరైన నిర్వహణ ఏర్పాట్లు చేయాలని స్థానికుల చిరకాల కాంక్ష.

కనిపించని అధికారుల చర్యలు

రోడ్డుపైనే వారపు సంత నిర్వహించి అటు వాహనదారులకు, స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నా పంచాయతీ అధికారులు, అటు పోలీసుల నుంచి నామమాత్రపు చర్యలు లేకపోవడాన్ని స్థానికులు తప్పుపడుతున్నారు. రద్దీగా ఉండే క్రమంలో దొంగతనాలు, పిక్‌పాకెటింగ్, అఘాయిత్యాలు వంటివి జరిగే అవకాశం ఉంది. అందులోనూ అధికంగా ట్రాఫిక్ సమస్య. అన్నీ తెలిసిన పంచాయతీ, పోలీసుల సమన్వయంతో సంత నిర్వహణపై ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బంది లేకుండా చూడాలి..

రైతులు, వ్యాపారులు రోడ్డుపైన ఎవ్వరికీ ఇబ్బంది లేకుండా వారపు సంతను నిర్వహించాలి. రోడ్డుపైన క్రయవిక్రయాలు జరిపితే అందరికీ ఇబ్బంది. ఈ ఇబ్బందులు లేకుండా రైతులు వ్యాపారిస్తులు అర్థం చేసుకోవాలి.
– సువ్వాల ఆనంద రెడ్డి, పచ్చికాపల్లం

రోడ్డుపై సంత లేకుండా చూడాలి..

అధికారులు రోడ్డుపై సంత లేకుండా చూడాలి. సంతకు ఉన్న జాగాలోనే వారపు సంత నిర్వహించేలా చూసుకోవాలి. ఎవరికి ఇబ్బంది లేకుండా ఈ వారపు సంత నిర్వహించేలా చర్యలు చేపట్టాలి.
మునికృష్ణ , పచ్చికాపల్లం పేట, వెదురుకుప్పం

రోడ్డుపై సంత లేకుండా చూస్తాం..

పచ్చికాపల్లంలో వారపు సంత రోడ్డుపైనే జరుగుతుంది వాస్తవమే. వచ్చే ఆదివారం వారపు సంత రోడ్డుపైన లేకుండా చర్యలు తీసుకుంటాం. పంచాయతీ కార్యదర్శులు అక్కడకి పంపిస్తాం. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం.
పురుషోత్తం, ఈవోఆర్‌డి, వెదురుకుప్పం

పోలీసుల సమన్వయంతో చర్యలు తీసుకుంటాం..

వచ్చే ఆదివారం లోపు అక్కడ సంత నిర్వహణ లేకుండా చూస్తాం. రైతులు, వ్యాపారస్తులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. స్థానిక పోలీసుల సమన్వయంతో చర్యలు చేపడతాం.
- మోహన్, పంచాయతీ కార్యదర్శి, పచ్చికాపల్లం

డెంగీ పట్ల అవగాహన

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: డెంగీ జ్వరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని యాదమరి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దాసరపల్లి ఆది ఆంధ్రవాడలో ప్రజలకు డెంగీ జ్వరాలపై అవగాహన కల్పించారు. డెంగీ వ్యతిరేక మాస ఉత్సవాల్లో భాగంగా దోమ కాటు వల్లనే డెంగీ వస్తుందని, అది పగటిపూట మంచి నీళ్లలో పెరిగే దోమ వల్లే వస్తుందని ఆయన వివరించారు. ఈ విషయాన్ని గుర్తించి నివాస గృహాల్లో నిలువ ఉంచే మంచినీటిపై మూతలు పెట్టాలని అలాగే ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి నిల్వ ఉంచిన నీటిని పారబోసి కొత్తగా నీటిని నింపుకోవాలన్నారు. దీని వలన నీటిలో ఉండే లార్వాలు నాశనం చేస్తామని తద్వారా దోమల వ్యాప్తిని తగ్గించవచ్చని ఆయన అన్నారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలంలో తప్పనిసరిగా దోమతెరలు వాడాలని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ లక్ష్మీపతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ పాలన సాగిద్దాం

- ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా సంక్షేమ పాలన సాగిద్దామని అందుకోసం ప్రతి ఒక్కరు పనిచేయాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పెద్దపంజాణి మండలంలోని కెళవాతి గ్రామంలో మండల ముఖ్య నాయకులతో ఆయన సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికలలో బూత్ వారీగా జరిగిన పోలింగ్ సరళిని ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు మనపై ఎంతో నమ్మకం, విశ్వాసంతో మంచి విజయాన్ని అందించారని వారి నమ్మకాన్ని నిలబెట్టేలా నాయకుల పని తీరు కనబరచాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందేలా చూడాలన్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన విధంగా కక్షపూరిత రాజకీయాలకు తావు లేని విధంగా పని చేస్తూ పార్టీలకు అతీతంగా పేదలకు మంచి చేసేలా నాయకులు హుందాగా వ్యవహరించాలని కోరారు. ఎన్నికలకు ముందు ఇంటింటికి తీసుకెళ్లిన సూపర్ సిక్స్ పథకాల అర్హులకు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలు ప్రభుత్వం నుంచి అందేలా చొరవ చూపాలన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఆనంద్, ప్రధాన కార్యదర్శి చలపతి, నాయకులు చెంగారెడ్డి, సుధాకర్ రెడ్డి, రోజా క్రిష్ణ రెడ్డి, నాగరాజు రెడ్డి, రాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌ఎల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-చిత్తూరు డిస్క్: విఆర్‌ఏల సంఘం నూతన కార్యవర్గాన్ని యాదమరి మండలంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విఆర్‌ఏల సంఘం నూతన అధ్యక్షులుగా చంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా పరదేశి, ఉపాధ్యక్షులుగా సుబ్బయ్య, సభ్యులుగా లక్ష్మీనారాయణ శ్యామ్, పార్వతి, శశికళ, చిట్టి బాబు, మునిరత్నం, కార్తీక్, ఢిల్లీ బాబును ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన నాయకులను యాదమరి విఆర్‌ఏలు ఘనంగా సన్మానించారు. విఆర్‌ఏల జిల్లా కమిటీ మెంబరగా ఎన్నికైన దేవరాజులును వీఆర్‌ఏలు ఘనంగా సత్కరించారు.

వర్కర్ల మధ్య చిచ్చు పెట్టొద్దు

- ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లలిత షకీలా

ప్రజాశక్తి-వెదురుకుప్పం/కార్వేటినగరం: ప్రాజెక్టులో వర్కర్స్ హెల్పర్‌కి అన్యాయం జరిగిందని ప్రకటన వచ్చిందని అక్కసతో సిడిపిఓ వర్కర్ల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని సోమవారం యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి, ప్రాజెక్టు కార్యదర్శి లలిత, షకీలా, మమతలు తెలిపారు. సిడిపిఓ సమక్షంలో కొంతమంది వర్కర్లు వచ్చి అవకతవకలు జరగలేదని చెప్పుకొచ్చారు. అయితే సిఐటియు నాయకురాలు శ్రీదేవి మాట్లాడుతూ అని ప్రకటన చేశారు. అసలు శ్రీదేవికి సిఐటియుకి ఎలాంటి సంబంధం లేదు. ఇది చాలు ఎవరు తప్పు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. నిజాయితీగా వుండే వారిని కూడా తోపు చేయిస్తున్నారు. సిడిపిఓ దగ్గరుండి మాట్లాడించడం ఏమిటని ప్రశ్నించారు. మిగతా సమయాల్లో వర్కర్లు ఆఫీసుకు రావాలంటే వర్కింగ్ సమయంలో ఎలా వస్తారని ప్రశ్నించేవారు. సోమవారం మాత్రం దగ్గర నుంచి మీడియా సమావేశం నిర్వహించారు. అది వర్కింగ్ సమయం కాదా అని వారు ప్రశ్నించారు. కష్టపడే వారందరూ జరుగుతున్న అన్యాయం మీద ఒకటిగానే ఉండాలి. కానీ అధికారులు ఈరోజు ఉంటారు రేపు వెళతారు. నిరంతరం మనమే వుండేది. ఐక్యంగానే వుందామని తెలిపారు. వారి మైకంలో పడవద్దు అని వర్కర్లకు తెలిపారు. ఎవరికి అన్యాయం జరిగినా సిఐటియు యూనియన్లకు అతీతంగా వారికి అండగా నిలబడుతుందని తెలిపారు.

పరామర్శ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని గోనుమాకులపల్లికి చెందిన గ్రామ రెవెన్యూ సహాయకుడు మునియప్ప ఇటీవల మృతి చెందాడు. ఈ సందర్భంగా సోమవారం మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ చామనేరు గ్రామానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతి చెందిన మునెప్ప కుమారుడు చెన్నప్ప పట్ల తెలుగుదేశం పార్టీ వారు వ్యహరించిన తీరుకు మానసిక క్షోభకు గురై గుండెపోటుతో మరణించినట్లు వారి కుటుంబ సభ్యులు మాజీ

ఎమ్మెల్యేకి తెలియజేసినట్లు తెలిపారు. ఈ నిమిత్తం వారి నివాసానికి నాయకులతో కలిసివెళ్లి మునెప్ప చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

తడి, పొడి చెత్తను వేరు చేయాలి

- ఐఓసీ మేనేజర్ చైతన్య

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా వేయాలని ఐఓసీ మేనేజర్ చైతన్య అన్నారు. సోమవారం బంగారుపాళ్యం మామిడి మార్కెట్‌లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహిచారు. ఐఓసి మేనేజర్ చైతన్య మాట్లాడుతూ పొడి చెత్త, తడి చెత్త విభజన, వ్యక్తిగత పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యత గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నివారించేందుకు ప్రజలకు జనపనార సంచులను పంపిణీ చేపడుతున్నామన్నారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం కోసం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో ఎకో బ్రిక్ తయారీ, దాని ఉపయోగాలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఓసీల్ నుంచి మార్కెట్ యార్డ్ ఇంచార్జి గంగయ్య పలువురు మామిడి రైతులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్‌కు తొలగిన అడ్డంకులు

- ఎట్టకేలకు స్పందించిన అధికారులు
- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు పట్టణ కేంద్రంలోని రంగబాబు సర్కిల్లో బస్ షెల్టర్‌ను అక్రమించుకొని వ్యాపారం సాగించారు. సాధారణ ప్రజలకు అక్కడ ఇబ్బంది ఏర్పడింది. దీంతో మానవ హక్కుల సంఘం నాయకులు ప్రజాశక్తి దృష్టికి తీసుకువచ్చారు. వారి విన్నపం మేరకు సోమవారం ప్రజాశక్తిలో 'దర్జాగా బస్సు షెల్టర్ కబ్జా శీర్షికన కథనం వెలువడింది. దీంతో స్థానిక మున్సిపల్ అధికారులు స్పందించారు. వెనువెంటనే రంగబాబు సర్కిల్ వద్ద ఉన్న బస్‌షెల్టర్ వద్ద అడ్డంకులు తొలగించారు. టెంకాయలను అక్కడి నుంచి తీసేయించారు. దీంతో బస్సు షెల్టర్ సాధారణ ప్రజలకు ఇబ్బంది లేకుండా అందుబాటులోకి వచ్చింది. సమస్యపై కథనం ప్రచురించిన ప్రజాశక్తికి పలువురు అభినందనలు తెలిపారు.

మోటారు.. ఇక అంతేనా సారూ..

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల శివాలయం ఎదురుగా ఉన్న రక్షిత మంచినీటి సరఫరా బోరు మోటారు పాడైపోవడంతో బోరులోని పైపులు కేబులు తీసి బయట పడేశారు. పంచాయతీ వారు బోరు మోటర్‌ను బాగు చేసి తాగునీటిని సరఫరా చేయాలని ఈ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్‌ను వివరణ కోరగా బోరు మోటారులోని వైన్డింగ్ కాలిపోవడంతో పుంగనూరుకు తరలించామని వైండింగ్ పనులు పూర్తికాగానే 24 గంటల్లోపు తీసుకువచ్చి బోరులో దించి ప్రజలకు తాగునీరు అందిస్తామని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- ప్రాథమిక వైద్యులు లోహిత్ చెంగల్రాయలు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తుంబ కుప్పం ప్రాథమిక వైద్యులు లోహిత్ చెంగల్ రాయలు అన్నారు. సోమవారం బంగారుపాళ్యం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలను తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వసతి గృహంలో పరిసరాలను శుభ్రంగా ఉంచాలని అదేవిధంగా మరుగుదొడ్లు నీటిని నిల్వ ఉంచే ప్రాంతాలను తరచు శుభ్రం చేయాలని వసతి గృహంలోని విద్యార్థులకు జ్వరం ఉంటే స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు చేపట్టుకోవాలని ప్రస్తుతం వ్యాధులు ప్రబలే సమయమని వీటికి ముందస్తు చర్యలు చేపట్టి వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్వో రమేష్ బాబు, సూపర్వైజర్ రమాదేవి, సిహెచ్ఓ దిలీప్, ఏఎన్ఎం రోజా రమణి పలువురు పాల్గొన్నారు.

బాధితులకు చెక్కు పంపిణీ



ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: గత ఎన్నికలలో మండలంలోని పుల్లూరు గ్రామపంచాయతీ పుల్లూరు గ్రామంలో అగ్రవర్ణాల దాడిలో నష్టపోయిన బాధితులకు వైసీపీ అధిష్టానం పార్టీ ఫండ్స్ నుంచి బాధితులకు రూ.లక్ష చొప్పున అందజేయడం జరిగిందని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పుల్లూరు గ్రామం బాధ్యులైన మురళి, కరుణాకరన్, గిరి, గౌతమి, మోసెస్‌లకు రూ.లక్ష చొప్పున విజయవాడ పార్టీ కార్యాలయం నుంచి హరికృష్ణ, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హరిత కుప్పయ్య, రమణ ప్రసాద్ రెడ్డి, జనార్ధన్, మనీ, గురువారెడ్డి, భూపతి రెడ్డి, కటిక పల్లి మణి, చిట్టి మహేష్, బాబు, కోటిరెడ్డి బాబు, దాము నాయుడు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టేడియాన్ని కూలగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

- అదే స్థలంలో తిరిగి పునర్నించాలి
- సిపిఐ జిల్లాసహాయ కార్యదర్శి డాక్టర్ టీ.జనార్ధన్

ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరు పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి కొందరు దుండగులు గత 30 సంవత్సరాలుగా క్రీడాకారులకు ప్రధానంగా బ్యాడ్మింటన్ ఆడే ఔత్సాహికులకు ఎంతగానో దోహదపడుతున్న ఫ్రెండ్స్ స్టేడియంను కూలగొట్టడం దుర్మార్గమని బాధ్యులను కఠినంగా శిక్షించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ టి.జనార్ధన్ డిమాండ్ చేశారు. రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత నిచ్చి అభివృద్ధి చేస్తామని ప్రమాణస్వీకారం చేసిన రోజే చెప్పారని అయితే క్రీడల్లో భాగంగా 30 సంవత్సరాలుగా షటిల్ కోర్టును ప్రజల సహకారంతో నిర్మించుకొని కొనసాగుతున్న ప్రదేశాన్ని కూల్చివేయడం దారుణమన్నారు. ఇలాంటి దుశ్చర్యలు పునరావృతం కాకుండా తగు చర్యలు చేపట్టాలని జనార్ధన్ డిమాండ్ జేశారు.

విద్యకు పెద్దపీట: ఎమ్మెల్యే మురళిమోహన్

ప్రజాశక్తి-తవణంపల్లి: తమ ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట వేస్తామని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైకిల్, విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అక్కడ మెరుగుపరచాల్సిన సౌకర్యాలను అధికారులతో కలిసి చర్చించారు. వసతుల కల్పనకు సంబంధించి అక్కడి ఎంఈవోకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు.

వైభవంగా గంగమ్మ ఉత్సవాలు

ప్రజాశక్తి-రామకుప్పం: మండల కేంద్రంలో నెలకొని ఉన్న గంగమాంబ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వాహకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం అమ్మవారికి వివిధ పుష్పాలతో అలంకరించి, పంచామృత అభిషేకం చేపట్టి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతిలిచి మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటుచేసి తీర్థ ప్రసాదాల పంచిపెట్టారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి

ప్రజాశక్తి-వి కోట: దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 75వ జన్మదిన వేడుకలను వికోటలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ ఆధ్వర్యంలో పార్టీ నేతలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పిఎస్ నాగరాజు, ఎంపీపీ యువరాజు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. తమీం ఖాన్, అక్మల్, శ్రీరాముల రెడ్డి, గోపిరెడ్డి, శశికళ కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలను సోమవారం జీడీ నెల్లూరులో అభిమానులు ఘనంగా నిర్వహించారు. వైయస్సార్ విగ్రహానికి పూలమాలవేసి భారీ కేక్ కట్ చేసి వైఎస్ఆర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హరిబాబు, ఏకాంబరం, ముని రాజారెడ్డి, వెంకట్ రెడ్డి, చిన్నబ్బారెడ్డి, గోవిందరెడ్డి, వెంకటేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: వైసీపీ కార్యాలయంలో సోమవారం వైయస్సార్ జయంతి వేడుకలు జరుపుకున్నారు. పద్మనాభ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శ్రేణులకు పంచిపెట్టారు.

ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి మిట్ట వాణిజ్య కూడలి వద్ద డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కొత్తపల్లి యువత శాము కొత్తపల్లిమిట్టలో యువత, ఏఎంసి డైరెక్టర్ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో కొత్తపల్లి, ఎస్ఆర్ పురం మండల కేంద్రంలోని స్థానిక సర్పంచ్ హరిత కుప్పయ్య ఆధ్వర్యంలో వైయస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి గజమాల వేసి నివాళులర్పించారు. నాయకులు, కార్యకర్తలు కలిసి అన్నదానం చేపట్టారు.

కార్వేటినగరం: వైఎస్ రాజశేఖరెడ్డి 75వ జయంతి వేడుకలను ఎంపీపీ లతబాలాజీ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఎంపీపీ లత మాట్లాడుతూ పేదలకు అందని ద్రాక్షలా ఉంటున్న ఉన్నత చదువులకు పీజు రియాంబర్స్మెంట్ తీసుకోచ్చిన ఘనత వైఎస్సార్దేనని అన్నారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్తీక్ రెడ్డి, మణెమ్మ, ప్రభాకరరెడ్డి, పురంధర్, ధనంజయవర్మ, పెరియస్వామిరెడ్డి, లోకనాథనాయుడు, మురగయ్య పలువురు పాల్గొన్నారు.

పూతలపట్టు: మండలంలో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 75 వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సోమవారం పి కొత్తకోట గ్రామంలోని వైయస్సార్ విగ్రహానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ సునీల్ కుమార్ ఇతర మండల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాబు రెడ్డి, రాజరత్నం రెడ్డి, జయ చంద్రారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు ఇతర నాయకులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: వైఎస్సార్ 75వ జయంతి సందర్భంగా సోమవారం బంగారుపాళ్యం మండల కేంద్రంలో మాజీ జెడ్పీ చైర్మన్ కుమార్‌రాజా ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. అన్నదానం చేపట్టారు. రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే లలిత కుమారి, జడ్పిటిసి సోమశేఖర్, శిరీష్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, శరత్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి పలువురు పాల్గొన్నారు.

సోమల: వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా సోమల బస్టాండ్ కూడలిలో వైయస్సార్ విగ్రహానికి వైస్ ఎంపీపీ ప్రభాకర్ మాజీ సర్పంచ్ శ్రీరాములు పూలమాలవేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో సాంబయ్య, వెంకటేశ్వరరావు, రమణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: ఆదర్శవంతమైన వ్యక్తి స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని మండల కన్వీనర్ బాగా రడ్డి అన్నారు. వైయస్సార్ 75వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని వైయస్సార్ విగ్రహానికి పూలమాలు వేశారు. కార్యక్రమంలో శంకరప్ప, పృధ్వీనాథ్, ప్రసాద్ రెడ్డి, జీడి బాబు, నాయకులు పాల్గొన్నారు.

సదుం: వైయస్ రాజశేఖర్ రెడ్డి 75 వ జయంతి సందర్భంగా సోమవారం సదుం బస్టాండ్ కూడలిలో వైసీపీ నాయకులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జిల్లాపరిషత్ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో వైయస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఉషా రాణి, బాబూ రెడ్డి, సయ్యద్ బాషా, రమేష్ రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, శివారెడ్డి, రామచంద్రయ్య, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

రామకుప్పం: వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు వైసిపి పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఆయనకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎంపిపి సుబ్రహ్మణ్యం, చంద్రారెడ్డి, చెంగారెడ్డి, పెనువెలు సింహ, నారాయణరెడ్డి, నారాయణస్వామి, యశ్వంత్ రెడ్డి, గణేష్, మంజునాథ్, సుధాకర్ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: దివంగత సీఎం రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా సోమవారం వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, ఎంపీపీ రెడ్డప్ప ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నారాయణస్వామి, రూపా జయకుమార్ పలువురు పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తలకు భరోసా

- న్యాయ విభాగం ఏర్పాటు

ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరులో వైసీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు జరిగితే కార్యకర్తలకు అండగా న్యాయ విభాగాన్ని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఏర్పాటు చేసి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. నలుగురు ప్రముఖ లాయర్ల ద్వారా టిడిపి చేస్తున్న దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటారు. వైసీపీ కార్యకర్తలపై దాడులను పోలీసులు పట్టించుకోకపోవడం, దాడులను అడ్డుకుంటుంటే తిరిగి వైసిపి కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్న నేపథ్యంలో కార్యకర్తలకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తను అండగా ఉండాలంటూ భరోసా ఇస్తున్నారు. తాజాగా పుంగనూరు మున్సిపల్ కేంద్రంలో ఉన్న బ్యాడ్మింటన్ కోర్టును జేసిబిలతో రాత్రికి రాత్రే నేలమట్టం చేసిన టిడిపి గుండాలు త్వరలో అడ్డుకట్టు వేస్తామన్నారు. న్యాయ విభాగంలో వైసిపి కార్యకర్తలకు ఇలాంటి సమస్యలు ఉన్న న్యాయవాదులను ఏం.ఎస్ రోహిత్‌రెడ్డి-9491076430, కె.వి.ఆనంద్-9849172053, పి.ఎన్.ఎస్ ప్రకాష్-9440001995, కె.అంజిబాబు-9449589591 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE (SENIOR DIVISION)
:: PALAMANER
O.E.P. No.13 of 2023
in
O.S.No. 301 of 2009

Between :
Simt. D.Neelamma ....D.Hr./Plaintiff
And :
Smt. S.Pushpa ....J.Dr/Defendant

SUMMONS TO THE J.Dr/DEFENDANT

To
Smt. S.Pushpa, aged about 44 years, W/o S.M.M.Krishna Prasad, Door No.3/81/2, Nehru Nagar, College Road, Old Pet, Palamaner Town, Post and Mandal, Chittoor District.

Please take notice that the petitioner filed the above case against you for recovery of the above said E.P. amount due. The above case is posted to 19.07.2024 for your appearance. So you can appear either in person or through your advocate before the Court on 19.07.2024 at 10.30 A.M. and file your objections if any in the above case. Failing which the matter will be decided in your absence basing on the records available.

//BY ORDER OF THE COURT//
P.V.SANJAY, B.A., LL.B.,
Advocate, Palamaner.